క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తురాలు శుక్రవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన వీసంశెట్టి రాధిక దంపతులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. దాత దంపతులకు ఆలయ సూపరింటెండెంట్ డీవీఎస్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

వెలుగు సిబ్బంది బదిలీ

బుట్టాయగూడెం: సాధారణ బదిలీల్లో భాగంగా బుట్టాయగూడెం మండలంలో పని చేస్తున్న నలుగురు సీసీలు బదిలీ అయినట్లు ఏపీఎం ఎస్‌వీవీ పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుట్టాయగూడెం సీసీ పాకా అరుణకుమారి, ఎన్‌ఆర్‌పాలెం సీసీ సీహెచ్ సత్యనారాయణ జీలుగుమిల్లి బదిలీ అయ్యారు. కాగా కేఆర్‌పురం సీసీగా పని చేస్తున్న ఎమ్‌వీఆర్ కుమారి జంగారెడ్డిగూడెం బదిలీ అయ్యారు. ఎఫ్‌పీఓ సీసీగా పని చేస్తున్న సీహెచ్ రిబ్కమ్మ బదిలీ అయినట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం: స్థానిక పేరంపేట రోడ్డులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి, రూ.5300 నగదును స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

స్థానిక శ్రీనివాసపురం రోడ్‌లో పేకాట స్థావరంపై దాడి చేసి, ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. వీరి నుంచి రూ.4300 స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తక్కువ ధరకు వంట నూనె



విలేకరులతో మాట్లాడుతున్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

జంగారెడ్డిగూడెం: జిల్లా కలెక్టర్, తహసీల్దార్ల ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వంట నూనెను తక్కువ ధరకు అందిస్తున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం హైమావతి సూపర్ మార్కెట్ మంచి నూనెను విక్రయించే కౌంటర్‌ను ప్రారంభించారు. శుక్రవారం సూపర్ మార్కెట్ వద్ద ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్ ద్వారా పామాయిల్ ధర రూ.110లకు, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.124కు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హైమావతి సూపర్ మార్కెట్ యజమాని ఉప్పల గంగాధర్, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు పాల్గొన్నారు.

పండుగకు ధరాఘాతం

- కొండెక్కిన కూరగాయల ధరలు
- ధరల నియంత్రణపై దృష్టి సారించని పాలకులు
- సామాన్యులపై ఆర్థిక భారం
- ఏం కొనలేం, ఏం తినలేం అంటున్న ప్రజలు



బుట్టాయగూడెంలో కూరగాయల దుకాణం

బుట్టాయగూడెం: కూరగాయల ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. దీంతో సాధారణ జనం బెంబేలెత్తిపోతున్నారు. దసరా పండుగ వచ్చింది కదా అని వంటల కోసం కూరగాయలు తీసుకుందామంటే టమాట, చిక్కుడు, బీర, బెండ, ఉల్లి వంటి కూరగాయల ధరలు మోతెక్కిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఏం కొనలేం, ఏం తినలేం అంటూ ప్రజలు అల్లాడిపోతున్నారు. పచ్చిమిర్చి సైతం కొనలేని స్థితి నెలకొంది.

సెంచరీ దాటిన టమాట, చిక్కుళ్ల ధర

టమాట ధర అమాంతంగా పెరిగిపోయింది. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.100 వరకూ వ్యాపారులు టమాటాలను విక్రయిస్తున్నారు. అదే విధంగా చిక్కుళ్లు రూ.120, బీర రూ.60, వంకాయ రూ.60, బెండ రూ.60, ఉల్లి రూ.50 చొప్పున అమ్ముతున్నారు. వీటితో పాటు క్యారెట్, బీట్‌రూట్, క్యాప్సికమ్, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, తదితర కూరగాయల ధరలకూ రెక్కలొచ్చాయి.

వారాంతపు సంతల్లోనూ రెట్టింపే

మార్కెట్ దుకాణాల్లో కూరగాయల ధరలు అధికంగా ఉంటే గిరిజన ప్రాంతంలో వారాంతపు సంతల్లో తక్కువ ధరలకు కూరగాయలు వచ్చేవి అయితే ప్రస్తుతం వారాంతపు సంతల్లోనూ ధరలు మండిపోతున్నాయి. అటవీ ప్రాంతంలోని మారుమూల గ్రామాల నుంచి నడుచుకుంటూ వచ్చి గిరిజనులు వారానికి సరిపడా సరుకులు తీసుకెళ్తుంటారు. అయితే ప్రస్తుత రేట్లతో గిరిజనులు కూడా బెంబేలెత్తిపోతున్నారు. వారానికి సరిపడా సరుకులు కొనాలంటే భయమేస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు ధరల నియంత్రణపై దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ధరలు చూస్తే భయమేస్తుంది



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రకాల కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యులు కనీసం మంచి కూర తినలేని పరిస్థితి కనిపిస్తుంది. ప్రభుత్వం స్పందించి కూరగాయల ధరలు తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కోరం దుర్గారావు, బుట్టాయగూడెం

ఆర్థిక పరిస్థితి దిగజారింది



గత ప్రభుత్వ పాలనలో మధ్య తరగతి ప్రజలను ఆదుకునే విధంగా అనేక సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు నేరుగా నగదును అందించే వారు. దీంతో సామాన్య ప్రజల్లో కొనుగోలు శక్తి ఉండేది. టీడీపీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించింది. సామాన్యుల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ చూడలేదు.

తెల్లం రమణ, కంసాలికుంట

మహిషాసుర మర్దనిగా దుర్గమ్మ

నేడు దసరా ఉత్సవాల ముగింపు



జంగారెడ్డిగూడెం: మహిషాసుర మర్దినిగా చాముండేశ్వరీదేవి



బుట్టాయగూడెం: బతుకమ్మలను ఊరేగిస్తున్న మహిళలు



కొయ్యలగూడెం: చాముండేశ్వరీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ



పోలవరం రూరల్: మహిషాసుర మర్దనిగా అమ్మవారు



చింతలపూడి: కనకదుర్గమ్మకు పూజలు నిర్వహించిన దృశ్యం



కామవరపుకోట: 108 వంటకాలతో అమ్మవారికి నైవేద్యం



జంగారెడ్డిగూడెం రూరల్: మహిషాసుర మర్దనిగా జ్ఞాన సరస్వతి

జంగారెడ్డిగూడెం: మండలంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. తొమ్మిదో రోజు పట్టణంలో కొలువైన అమ్మవారు విశేష పూజలు అందుకున్నారు. గ్రామదేవత గంగానమ్మ మహిషాసుర మర్దనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది.

గంగానమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే:

అమ్మవారిని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అర్చకులు వేదాశీర్వాదం అందించారు.

మహాకాళిగా గంగానమ్మ

మహాకాళికాదేవి అలంకరణలో జంగారెడ్డిగూడెం గ్రామదేవత గంగానమ్మ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. శుక్రవారం మహార్నవమిని పురస్కరించుకుని రెండో అవతారంగా మహాకాళికాదేవిగా అమ్మవారిని అలంకరించి, వేదమంత్రాల నడమ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

కొయ్యలగూడెం: దేవీ నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం కనకదుర్గమ్మ చాముండేశ్వరీదేవి, మహిషాసుర మర్దని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. బయ్యనగూడెంలో శనివారం దసరా సందర్భంగా బోనాల జాతర మహోత్సవం నిర్వహించనున్నారు.

అయ్యప్పక్షేత్రం ఉపాలయంలో పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలో దేవాలయాల్లో కొలువై ఉన్న అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురవాయిగూడెం అయ్యప్పక్షేత్రంలో ఉపాలయంలో కొలువైన శ్రీజ్ఞాన సరస్వతి, రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో కొలువైన శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు మహిషాసుర మర్దనిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మహిషాసుర మర్దనిగా కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల: దసరా ఉత్సవాల్లో భాగంగా క్షేత్రదేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు మహిషాసుర మర్దని దేవిగా శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. అష్ట భుజాలతో సింహవాహినిగా అవతరించి, దుష్టుడైన మహిషాసురిడిని సంహరించే మహిషాసుర మర్దనీదేవిగా అమ్మవారు భక్తులను కటాక్షించారు.

నేడు క్షేత్రంలో కుంకుళ్లమ్మ రథోత్సవం

క్షేత్ర దేవత కుంకుళ్లమ్మకు రథోత్సవం శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అన్న సమారాధన

స్థానిక రాజరాజేశ్వరి ఆలయ సమీపంలోని ఆళ్వార్ సదనంలో శనివారం భారీ అన్న సమారాధనను నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అదే విధంగా ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద శుక్రవారం భారీ అన్న సమారాధనను నిర్వహించారు.

108 వంటకాలతో అమ్మవారికి నైవేద్యం

కామవరపుకోట: మండలంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కామవరపుకోటలో అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం పూజలు నిర్వహించి, 108 వంటకాలతో నైవేద్యం సమర్పించారు.

పూజలందుకున్న దుర్గమ్మ

చింతలపూడి: యర్రగుంటపల్లిలో ఏర్పాటుచేసిన కనకదుర్గమ్మ అమ్మవారికి దసరా శరన్నవరాత్రి 9వ రోజు విశేష పూజలు నిర్వంచారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అన్న సమారాదన నిర్వహించారు.

మహిషాసుర మర్దినిగా అమ్మవారు

పోలవరం రూరల్: దేవీ శరన్నవరాత్రా మహోత్సవాల సందర్భంగా తొమ్మిదో రోజు అమ్మవారిని మహిషాసుర మర్దనిగా అలంకరించి పూజలు నిర్వహించారు. పోలవరం, పట్టిసీమ, గూటాల గ్రామాల్లో అమ్మవారి దేవాలయాలు భక్తులతో కళకళలాడాయి.

అన్న సమారాధన

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీఅయ్యప్పస్వామి వారి క్షేత్రంలో ఈ నెల 12 దసరా పర్వదినాన్ని పురష్కరించుకొని స్వాములకు అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గంగు జగన్ మోహన్‌రెడ్డి, జి.వెంకటేశ్వరరావు తెలిపారు.

ప్రత్యేకంగా బతుకమ్మ సంబరాలు

బుట్టాయగూడెం: దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని మండలంలోని రెడ్డిగణపవరంలో కొలువైన దుర్గమ్మ తల్లికి అక్కడి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా తెలంగాణ ప్రాంతంలో అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మ వేడుకలను గణపవరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యే దసరా శుభాకాంక్షలు



మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: విజయదశమి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని ప్రజలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా నిర్వహించే విజయదశమి వేడుకలను ప్రతీ ఒక్కరూ ఆనందోత్సవాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

రతన్ టాటాకు భారతరత్న ప్రకటించాలి

కొయ్యలగూడెం: స్వర్గీయ రతన్ టాటాకు భారత రత్న పురస్కారం ప్రకటించాలని సురక్ష హాస్పిటల్ అధినేత కొండముది దిలీప్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం హాస్పిటల్ ప్రాంగణంలో రతన్ టాటా సంస్మరణ కార్యక్రమం కొయ్యలగూడెం వాసవీ క్లబ్ సభ్యుడు సాలసా సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో తన సంస్థలోని ఏ ఒక్క ఉద్యోగిని తొలగించకుండా కార్పొరేట్ దిగ్గజాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా రతన్ టాటా చిత్రపటానికి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

నకిలీ విలేకరుల అక్రమ దందా

కొయ్యలగూడెం: రాజవరం పంచాయతీ పరిసర ప్రాంతాలలో ఇరువురు నకీ విలేకరులు వసూళ్లకు పాల్పడుతున్నారని ప్రజలు, రైతులు గగ్గోలు పెడుతున్నారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద పలువురు విలేకరులకు ఫిర్యాదు చేశారు. రోషన్ కుమార్ బాబు, వంశీ అనే ఇద్దరు మట్టి, ఇసుక ట్రాక్టర్ల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని, ఇవ్వని వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. అదేవిధంగా ఎర్రకాలువ వంతెనపై తెల్లవారు జామున కాపు కాసి బియ్యం లోడుతో వెళ్తున్న వాహనాలను ఆపి భారీ మొత్తంలో సొమ్ములు దండుకుంటున్నారని అన్నారు. ఇటీవల ప్యాసింజర్ ఆటోలో ఒక మహిళ సుమారు 50 కేజీల రేషన్ బియ్యాన్ని తీసుకు వెళుతుండగా ఆపి భయపెట్టి వసూలు చేశారన్నారు. దీనిపై ఎస్సై వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

షాపులు 16.. టెండర్లు 957

జంగారెడ్డిగూడెం: షాపులు 16, టెండర్లు 957 ఎక్సైజ్ నూతన మద్యం పాలసీలో టెండర్ దరఖాస్తుల స్వీకరణలో జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో శుక్రవారం సాయంత్రానికి ఉన్న పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీ పేరున మద్యం షాపుల లైసెన్సుల కోసం టెండర్ల స్వీకరణ ప్రారంభించింది. ఇందుకు గాను జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 16 షాపుల కేటాయించగా, వాటిలో జంగారెడ్డిగూడెం పట్టణం 7, మండలం 4, వేలేరుపాడు 1, జీలుగుమిల్లి 2, కుక్కునూరు 2 షాపులు కేటాయించారు. ఈ నెల 14న ఏలూరులోని మినీ బైపాస్‌లో గల చలసాని గార్డెన్స్‌లో డ్రా ప్రక్రియ నిర్వహిస్తారని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి



శిక్షణను తీసుకుంటున్న విద్యార్థులు

కొయ్యలగూడెం: విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకొని సాధించుకోవాలని ఒకేషనల్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ పాక వెంకట్ పేర్కొన్నారు. గవరవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఒకేషనల్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఆయన సబ్జెక్టు గురించి దిశా నిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థులు కొయ్యలగూడెం పీహెచ్‌సీలో హెల్త్ కేర్ విభాగాలలో శిక్షణ తీసుకున్నారు. కార్యక్రమంలో హెల్త్ కేర్ ఒకేషనల్ శిక్షకులు ఎం.మంజూష, పి.వెంకట్, హెచ్ఎం గొల్లపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ

జంగారెడ్డిగూడెం: ఆకలి అన్నవారికి లేదనకుండా అన్నం పెట్టి ఆంధ్రుల అన్నపూర్ణగా పేరుపొందిన డొక్కా సీతమ్మ గారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కేవీఆర్ సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 13 ఆదివారం ఉదయం 11 గంటలకు అశ్వరావుపేట రోడ్డులోని బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా శ్రీ సర్వమంగళా సహిత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం ఎదురుగా కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

● ఆకాశంలో వెండి కొండలు



ఆకాశంలో కరి మబ్బులు ఉండాల్సిన సాయం సంధ్య వేళ ఈ మేఘాలు వెండి కొండలను తలపిస్తున్నాయి. అరుదుగా కనిపించే ఈ దృశ్యం తిర్లాపురంలో శుక్రవారం ఆవిష్కృతమైంది. - వేలేరుపాడు

శిథిలావస్థలో కల్వర్టు



అలివేరు సమీపంలో దెబ్బతిన్న కల్వర్టు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన అలివేరు, లంకపాకల మధ్య ఉన్న కల్వర్టు ఇటీవల కురుస్తున్న వర్షాలకు బీటలు వారి శిథిలావస్థకు చేరింది. అధికారులు వెంటనే ఈ కల్వర్టు మరమ్మతు పనులు చేపట్టకపోతే లంకపాకల, డోలుగండి, రేగులపాడు, రేపల్లె గ్రామాలకు వెళ్లే గిరిజనులకు రహదారి ఇబ్బందులు పడే అవకాశం ఉందని సర్పంచ్ కారం లక్ష్మి తెలిపారు. వర్షాలు విస్తారంగా కురిస్తే కల్వర్టు పూర్తిగా పాడైపోయే అవకాశం ఉన్నందున వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

బాలికలు స్వీయ సంరక్షణ అలవర్చుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

చింతలపూడి: మహిళలు, బాలికలు స్వీయ సంరక్షణ అలవర్చుకోవాలని ఎంపీపీ డాక్టర్ రాంబాబు నాయక్ అన్నారు. చింతలపూడి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో మురళీకృష్ణ, తహసీల్దార్ డి.ప్రమద్వర, సీడీపీవో మాధవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, హెచ్‌వీ, డీటీ, ఏడబ్ల్యూడబ్ల్యూఎస్, బాలికలు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

జంగారెడ్డిగూడెం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ కె.స్లీవ జోజి, ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణప్రసాద్ పాల్గొని కిషోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కిషోర బాలికలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు కె.లక్ష్మి, ఎం.విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సమాయకులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

పోలవరం రూరల్: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బేటీ బచావో–బేటీ పఢావో కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పాడుం పుష్ప అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీవో ఎస్ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు.

బాలికలకు సన్మానం

కొయ్యలగూడెం: అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని శుక్రవారం కొయ్యలగూడెంలో వినూత్నంగా నిర్వహించారు. టెంపుల్స్ సెంటర్‌లో శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో భక్తులు కలిసి తొమ్మిది మంది బాలికలను నవదుర్గలుగా భావిస్తూ వారికి పాలక మండలి చైర్మన్ మంతెన సోమరాజు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

విద్యతోనే గౌరవం

బుట్టాయగూడెం: ఆడపిల్లలు ఉన్నత విద్యను పొందితేనే హక్కులు, సమానత్వం, సాధ్యమై గౌరవం పొందుతారని డిప్యూటీ తహసీల్దార్ పాయం రమేష్ అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని బాలికలను ఉద్దేశించి మాట్లాడారు.